TS 24 0026809

# నేటి ప్రభాతదర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ఎడిటర్ : కనుకుల అనంతరెడ్డి

www.netiprabhatadarshini.in 94932 72754

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 52 ఆదివారం, మార్చి 01, 2026 , పేజీలు - 4 వెల: 1/-




# కాకినాడ జిల్లాలో భారీ పేలుడు..
# 21 మంది మృతి..?

**కాకినాడ జిల్లా :** ఏపీలోని కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం-జి.మే డుపాడు మధ్య భారీ పేలుడు సంభవించింది. ఒక బాణాసంచా తయారీ కేంద్రంలో జరిగిన పేలుడులో 18 మందికిపైగా మరణించినట్లు సమాచారం. మరో ఐదుగురు గాయపడ్డారు. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. ఘటనా స్తలంలో ఇంకా భారీగా మంటలు ఎగసిపడుతున్నాయి. ప్రమాద స్థలంలో ఇంకొందరు చిక్కుకున్నట్లు తెలుస్తోంది. ఇది స్తానికుల నుంచి అందిన ప్రాథమిక సమచారం. అయితే, మృతులు, క్షతగాత్రుల విషయంలో అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది. పేలుడు ధాటికి మృతదేహాలు పొలాల్లోకి ఎగిసిపడ్డాయి. అక్కడ పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. ఇంకా మంటలు అదుపులోకి రాలేదు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలే ఉన్నట్లు తెలుస్తోంది. పేలుడు సమయంలో అక్కడ 20 మందికిపైగా కార్మికులు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు ప్రభావంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో దట్టమైన పొగ అలుముకుంది. ఇంకా పేలుడు కొనసాగుతోంది. పరిమితికి మించి బాణాసంచా తయారు చేయడం వల్లే ఈ ఘటన అని ప్రాథమిక అంచనా. స్థానిక పెదపూడి రోడ్డులోని పొలాల్లో అడపా నాని కుటుంబ సభ్యులు ఒక బాణాసంచా తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం ఈ తయారీ కేంద్రంలో పేలుడు సంభవించింది. పేలుడు పదార్థాలు అక్కడే ఉండటంతో మంటలు ఎగసిపడుతున్నాయి.



సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. మంటలు అదుపులోకి తేవడం కష్టంగా మారింది. భారీ పేలుడు శబ్దాలు రావడంతో స్తానికులు భయాందోళనకు గురయ్యారు.

## దేశవ్యాప్తంగా HPV వ్యాక్సినేషన్ ప్రారంభించిన ప్రధాని మోదీ




**న్యూ ఢిల్లీ :** దేశంలో మహిళల ఆరోగ్య పరిరక్షణ దిశగా కేంద్ర ప్రభుత్వం నేడు ఒక చారిత్రాత్మక అడుగు వేస్తోంది. ప్రాణాంతకమైన సర్వైకల్ క్యాన్సర్ (గర్భాశయ ముఖద్వార క్యాన్సర్) బారి నుండి బాలికలను రక్షించేందుకు ఉద్దేశించిన ఉచిత న్పూఎ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకా పంపిణీ కార్యక్రమం (ఫిబ్రవరి 28, శనివారం) దేశవ్యాప్తంగా ప్రారంభం కానుంది. రాజస్థాన్‌లోని అజ్మీర్ వేదికగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ బృహత్తర వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను లాంఛనంగా ప్రారంభించనున్నారు. ప్రధాని మోదీ అజ్మీర్‌లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం, అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఇంకా ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతుంది.

# విద్యా కమిషన్ సిఫారసులతో పేద విద్యార్థులు విద్యకు దూరం



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 :** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా కమిషన్ రిపోర్టును చెత్తబుట్టలో వేయాలని ఎద్దేవా చేశారు. విద్యారంగ అభ్యున్నతి కోసం సిఫారసులేవి? అని ప్రశ్నించారు. టీచర్ల జీతాలను తగ్గించాలని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. విద్యావేత్తలు లేని విద్యా కమిషన్ ఇదని విమర్శించారు. ఇవాళ(శనివారం) హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. అర్బన్ నక్సలైట్ ఆధ్వర్యంలో వేసిన కమిషన్‌కు విలువేముంది..? అని నిలదీశారు. పేద విద్యార్థులు విద్యకు దూరం..విద్యాశాఖకు మంత్రి లేరనే విషయాన్ని కూడా గుర్తించని కమిషన్ ఎందుకు? అని బండి సంజయ్ ప్రశ్నల వర్షం కురిపించారు. చాక్ పీసులకు పైసల్లేక, స్కావెంజర్లు లేక స్కూళ్లు అల్లాడుతుంటే పరిష్కార మార్గాలు చూపరా..? అని ఫైర్ అయ్యారు. కనీస ఉత్తీర్ణత మార్కులను 35 నుంచి 45కు పెంచడం దుర్మార్గమని అన్నారు. పేద విద్యార్థులు స్కూల్ స్థాయిలోనే ఫెయిలై ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలతో, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలను తీసుకోకుండా రూపొందించిన ఏకపక్ష నివేదిక ఇదని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయులకు అవమానం..ఉపాధ్యాయులను విద్యా కమిషన్ అవమానించిందని బండి సంజయ్ మండిపడ్డారు. స్థానిక పరిస్థితులను పట్టించుకోకుండా విదేశాల్లో తిరిగి నివేదిక ఇస్తే ఒరిగేదేముంది..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఉపాధ్యాయులారా...మీకు అండగా బీజేపీ ఉంటుందని భరోసా కల్పించారు. ఇళ్ల కూల్చివేతలో రేవంత్‌రెడ్డికి గిన్నిస్ రికార్డు ఖాయమని ఎద్దేవా చేశారు. మావోయిస్టుల విషయంలో రేవంత్‌రెడ్డిది ద్వంద్వ వైఖరి అని ఆగ్రహించారు. అర్బన్ నక్సలైట్లను కమిటీల్లో వేస్తారని... లొంగిపోయిన మాజీలను ప్రోత్సహిస్తున్నారని బండి సంజయ్ దుయ్యబట్టారు.

# నిర్ణీత సమయంలో ఫైల్ క్లియర్ కావాల్సిందే
## అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక పేరుతో 99 రోజుల కార్యాచరణ ఉంటుందని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి (జవీ =వఋుఅ్ష్ట =వ౨౨ఎ) వ్యాఖ్యా నించారు. మార్చి 4వ తేదీన జరిగే కలెక్టర్ల సమావేశంలో అందరి పని తీరుపైన మాట్లాడతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేక లోగో తయారు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏఐ సమావేశం నిర్వహణపై కొన్ని విమర్శలు వచ్చాయని.. కానీ తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ అందరి దృష్టిని ఆకర్షించిందని తెలిపారు. ఇవాళ (శనివారం) సచివాలయంలో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ప్రణాళికాబద్ధంగా జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్‌లుగా విభజించామని అన్నారు. కోర్ అర్బన్ రీజియన్‌లో చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్యూర్ అర్బన్ రీజియన్ 10 వేల చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉందని.. ఇక్కడ మాన్యుఫాక్చరింగ్ రంగం విస్తరించాలని తెలిపారు. పారిశ్రామికీకరణలో తెలంగాణ.. దేశానికే ఆదర్శంగా ఉండాలని.. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని దిశానిర్దేశం చేశారు. శాఖలపై అవగాహన ఉండాలి..'సేవా రంగంలో వస్తున్న పెను మార్పులను పరిగణనలోకి తీసుకోవాలి. శాఖలపై ప్రతి ఒక్కరికీ సంపూర్ణ అవగాహన ఉండాలి. శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జాబితా సిద్ధం చేయాలి. ప్రభుత్వ కార్యాలయాలు.. అద్దె భవనాల్లో ఉండడానికి వీలు లేదు. ప్రతి శాఖకూ సొంత



భవనం ఉండాలి.. బడ్జెట్ ప్రతిపాదనలో వీటిని చేర్చాలి. కేంద్ర ప్రాయోజిత పథకాలపై ప్రతి శాఖ దృష్టి పెట్టాలి.. అధికారులు అప్రమత్తంగా ఉండాలి. సర్వీస్ సెక్టార్‌ను పూర్తిగా ప్రక్షాళన చేయాలి.. ఆన్‌లైన్ విధానంలో అన్ని పనులూ జరిగేలా చూడాలి. ఈ ఫైల్ విధానం ఉండాలి. నిర్ణీత సమయంలో ఫైల్ క్లియర్ కావాల్సిందే. వివిధ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలు , పెట్టుబడులు గ్రౌండ్ కావాలి. పాత కాలం సర్వర్లను అప్‌డేట్ చేసుకోవాలి. సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి.. ఇందులో సాంకేతికతను వినియోగించుకోవాలి. నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందాలి. 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీపై దృష్టి పెట్టాలి. ఫ్యూచర్ సిటీ దేశ ఆర్థిక స్థితిని మార్చబోతోంది' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

డిజిటల్ గవర్నెన్స్‌పై దృష్టి పెట్టాలి..మూసీనది పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని.. ఇక్కడ వచ్చే మార్పులను ప్రజలకు వివరించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. 'డిజిటల్ గవర్నెన్స్‌పై దృష్టి పెట్టాలి. నాణ్యమైన విద్యను అందించడంపై దృష్టి సారించాలి. వంద నియోజకవర్గాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభించబోతున్నాం. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు మెరుగుపడాలి. ప్రాంతాల వారీగా మెడికల్ డేటా తయారు చేయాలి. ప్రతి సెక్రటరీ తమ శాఖలల్లో బెస్ట్ ప్రోగ్రామ్‌ను డిజైన్ చేసుకోవాలి. మార్చి 6వ తేదీ నుంచి 99 రోజుల ప్రణాళిక జూన్ 12వ తేదీ వరకు జరగబోతుంది. జూన్ 2వ తేదీ వరకు ప్రతి ఆఫీస్ పరిశుభ్రంగా కావాల్సిందే. జూన్ 2వ తేదీ తెలంగాణకు పండుగ.. పండుగను అంతా ఘనంగా జరుపుకోవాలి. మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమం. ప్రతి అధికారి ఈ కార్యక్రమంలో పాల్గొనాలి.. మినహాయింపులు ఉండవు. శాఖల మధ్య ఉండాలి. ప్రతి ఎన్నికలో ప్రజలు నాకు కావాల్సిన బలాన్ని ఇచ్చారు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మనం ప్రజలకు మంచి చేయాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# కోకాపేటలో రాజశ్యామల ఆలయాన్ని ఖాళీ చేయించేందుకు యత్నం.



**రంగారెడ్డి, ఫిబ్రవరి 28:** కోకాపేట్ నియోపోలిస్‌లోని విశాఖ శారదా పీఠంలో రాజశ్యామల అమ్మవారి ఆలయాన్ని ఖాళీ చేయించేందుకు రెవెన్యూ అధికారులు, పోలీసులు చేరుకున్నారు. దీంతో ఆలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సంఘటనపై బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. (శనివారం) ఉదయమే మాజీ మంత్రి ఆలయం వద్దకు చేరుకున్నారు. పీఠం నిర్వాహకులను భయాందోళనలకు గురిచేస్తున్నారని హరీశ్ రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కూల్చడం తప్ప మరో పని లేదని ఆయన మండిపడ్డారు. ఖమ్మంలో పేదల ఇండ్లు కూల్చారని.. ఇప్పుడు హైదరాబాద్‌లో శారదా పీఠం కూలుస్తున్నారని ఫైర్ అయ్యారు. మైనింగ్ కోసం సీఎం మేనల్లుడికి భూములు కేటాయించారని, సీఎం అల్లుడికి ఇవ్వడానికి 17 ఎకరాలు దొరికాయని ఆయన అన్నారు. శారదా పీఠానికి కేటాయించిన రెండు ఎకరాలు ఎందుకు లాక్కుంటున్నారని ప్రశ్నించారు. రాత్రి 11 గంటలకు పోలీసులు, ఎమ్మార్వో వచ్చారని.. తాను ఉదయం 8 గంటలకే స్థలానికి చేరుకున్నానని హరీశ్ రావు చెప్పారు. తాను వచ్చేసరికి పోలీసులు, ఎమ్మార్వో, ఆర్ఐ వెళ్లిపోయారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో మఠానికి భూములు కేటాయించారనే కక్షతో ఇలాంటి చర్యలు తీసుకుంటున్నారని మాజీ మంత్రి ఆరోపించారు. సీఎంకు దేవుడు మీద నమ్మకం లేకపోవచ్చుని.. మంత్రి శ్రీధర్ బాబు అయినా చెప్పాలి కదా అని ప్రశ్నించారు. ఇక్కడ పూజలు చేయొద్దని పోలీసులు ఎలా ఆపుతారు అంటూ మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఢిల్లీ మద్యం కేసుతో రాజకీయంగా నష్టపోయాం
## కానీ చివరికి గెలిచేది సత్యమే



**హైదరాబాద్ :** ఢిల్లీ మద్యం కేసు కారణంగా గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా తీవ్రంగా నష్టపోయిందని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ కేసు కేవలం రాజకీయ కక్షతో అల్లిన కుట్ర అని, దీని వల్ల పార్టీ ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కవితకు కోర్టులో న్యాయం జరగడం పట్ల స్పందిస్తూ, త్వరలోనే తమ పార్టీ నేతలపై ఉన్న మిగతా అబద్ధపు కేసులు కూడా వీగిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మద్యం కుంభకోణం అనే పేరుతో ఢిల్లీలోని కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా, తెలంగాణలో బీఆర్ఎస్ ను బలహీనపరచడానికి ప్రత్యర్థి పార్టీలు దీనిని ఒక అస్త్రంగా వాడుకున్నాయని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలు బాధ్యతారహితంగా చేసిన ఆరోపణల వల్ల ప్రజలు తప్పుదోవ పట్టారని ఆయన పేర్కొన్నారు. నిజం నిలకడ మీద తెలుస్తుందని, కానీ ఈ లోపు జరిగిన ప్రచారం వల్ల పార్టీకి కోలుకోలేని రాజకీయ నష్టం జరిగిందని ఆయన వివరించారు. నేటి రాజకీయాల్లో సాక్ష్యాల కంటే ఆరోపణలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, న్యాయ ప్రక్రియ కంటే మీడియాలో వచ్చే కథనాలే ప్రజల అభిప్రాయాలను ప్రభావితం చేస్తున్నాయని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యర్థులను అణచివేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. అయితే, అంతిమంగా న్యాయమే గెలుస్తుందని, కవితపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని కోర్టు తీర్పుల ద్వారా స్పష్టమవుతోందని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు బీఆర్ఎస్ సీనియర్ నేత వినోద్ కుమార్ కూడా ఈ అంశంపై స్పందిస్తూ, తమ పార్టీ అధినేత కేసీఆర్ ముందుగా చెప్పినట్లుగానే కవిత ఈ కేసు నుండి 'కడిగిన ముత్యంలా' బయటకు వస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. కేజ్రీవాల్, మనీష్ సిసోడియా వంటి నాయకులపై పెట్టిన కేసులు కూడా రాజకీయ ప్రేరేపితమైనవేనని ఆయన అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను వాడుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆయన హితవు పలికారు.

# 'హెచ్‌పీవీ' వ్యాక్సినేషన్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టిన తెలంగాణ ప్రభుత్వం



**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** మహిళల ప్రాణాలను హరిస్తున్న గర్భాశయ క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) నివారణ దిశగా తెలంగాణ ప్రభుత్వం శనివారం హ్యూమన్ పాపిలోమా వైరస్ వ్యాక్సిన్ పంపిణీకి శ్రీకారం చుట్టింది. హైదరాబాద్‌లోని కింగ్ కోఠి హాస్పిటల్‌లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను ప్రారంభించారు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఆడబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం కారణంగా దేశవ్యాప్తంగా క్యాన్సర్ మహమ్మారి కోరలు చాస్తోంది. దురదృష్టవశాత్తు, మన రాష్ట్రంలో కూడా ఏటా 55,000 నుండి 60,000 క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. రాబోయే ఐదేళ్లలో ఈ సంఖ్య మరో 10% పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేన్సర్ వైద్య సేవలు కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా, ములుగు, ఆదిలాబాద్ వంటి మారుమూల జిల్లాల్లో కూడా ఇప్పుడు కీమోథెరపీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాం. దేశంలో మహిళల్లో వచ్చే క్యాన్సర్లలో సర్వైకల్ కేన్సర్ రెండవ స్థానంలో ఉంది. మన రాష్ట్రంలో ఏటా సగటున 3,200 మంది మహిళలు ఈ క్యాన్సర్ బారిన పడుతున్నారు. ఈ క్యాన్సర్ 99.7% మంది పేషెంట్లకు హ్యూమన్ పాపిలోమా అనే వైరస్ వల్లే వస్తుంది. వైరస్‌ను అంతం చేయడానికే.. ఈ రోజు కేంద్ర ప్రభుత్వ సహకారంతో, రాష్ట్రవ్యాప్తంగా న్పూఎ వ్యాక్సినేషన్ డ్రైవ్ కు శ్రీకారం చుట్టాం. కానీ, ప్రభుత్వం దీనిని పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. నేటి నుంచి 3 నెలల వరకూ వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగనుంది. నెల రోజుల వరకూ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్స్, ఏరియా హాస్పిటల్స్, కమ్యునిటీ హెల్త్ సెంటర్లతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ టీకా లభిస్తుంది. త్వరలోనే పీహెచ్‌సీల్లో కూడా అందుబాటులోకి తీసుకొస్తాం. తల్లిదండ్రులందరికీ నా విజ్ఞప్తి. మీ ఇంట్లో 14 ఏళ్ల ఆడబిడ్డ ఉంటే, వెంటనే ముందుకు వచ్చి ఈ టీకా ఇప్పించండి. మన ఆడబిడ్డల భవిష్యత్తును, తద్వారా తెలంగాణ భవిష్యత్తును కాపాడుకుందాం' అని అన్నారు.

# కాంగ్రెస్ దేశ ప్రతిష్ఠను దిగజార్చుతోంది

- ముస్లిం లీగ్‌లా ద్వేషపూరిత రాజకీయాలు చేస్తోంది



**హైదరాబాద్, ఫిబ్రవరి 28:** ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ చొక్కాలు విప్పి చేపట్టిన నిరసనలపై ప్రధాని నరేంద్ర మోదీ శనివారం మండిపడ్డారు. కాంగ్రెస్ ఇప్పుడు 'ముస్లిం లీగ్–మావోయిస్ట్ కాంగ్రెస్'గా మారిందని, దేశప్రతిష్ఠను దిగజార్చేందుకు ఎక్కడ వీలైతే అక్కడ చొరబడేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాజస్థాన్‌లోని అజ్మీర్ కాయద్ విశ్రామ్ స్థల్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడిన ఆయన కాంగ్రెసపై విరుచుకుపడ్డారు. "భారతదేశంపై ముస్లిం లీగ్‌కు ఉన్న విద్వేషమే దేశ విభజనకు కారణమైంది. నేడు కాంగ్రెస్ కూడా అదే రీతిలో వ్యవహరిస్తోంది. యూత్ కాంగ్రెస్ నేతలు చొక్కాలు విప్పి ఏఐ సమ్మిట్?లో నిరసనలు వ్యక్తం చేశారు. వాస్తవానికి వాళ్లు విదేశీ ప్రతినిధుల ముందు భారతదేశాన్ని అవమానించడానికి నాటకాలు ఆడారు. ఏఐ సమ్మిట్?ను చూసి దేశ ప్రజలు గర్వపడుతూ ఉంటే, కాంగ్రెస్ మాత్రం విదేశీ అతిథుల ముందు దేశాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రయత్నించింది. కాంగ్రెస్ దేశవ్యాప్తంగా వరుసగా ఎన్నికల్లో ఓడిపోతోంది. ఆ కోపంతోనే దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తూ ప్రతీకారం తీర్చుకుంటోంది. 'మరోవైపు 'మావోయిస్టులు కూడా భారతదేశ శ్రేయస్సును, మన రాజ్యాంగాన్ని, మన విజయవంతమైన ప్రజాస్వామ్యాన్ని చూసి అసూయ పడతారు. వారు మనపై దాడులు చేస్తారు. కాంగ్రెస్ చేసిన తప్పులను దేశం ఎన్నటికీ క్షమించదని, దేశాన్ని అప్రతిష్ఠపాలు చేయడం, సాయుధ దళాలను బలహీనపరచడం ప్రతిపక్ష పార్టీకి పాత అలవాటేనని ప్రధాని అన్నారు. 'మన సాయుధ దళాలు తమ పరాక్రమంతో ప్రపంచ గుర్తింపు పొందాయి. కానీ కాంగ్రెస్ నేతలు, మన ప్రత్యర్థుల తప్పుడు ప్రచారాలనే పదేపదే వినిపించారు. దేశానికి ఏది మంచిదో, దేశానికి, పౌరులకు ఏది ప్రయోజనకరమో కాంగ్రెస్ వాటన్నింటినీ వ్యతిరేకిస్తుంది. అందుకే ఈ రోజు దేశం కాంగ్రెస్?కు తగిన బుద్ధి చెబుతోంది' అని మోదీ పేర్కొన్నారు.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవము





**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి.**
బాన్సువాడ మండలం కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త సర్ సీవీ రామన్ 1928 ఫిబ్రవరి 28న 'రామన్ ఎఫెక్ట్'ను కనుగొన్నారు. ఈ ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి ఏటా ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకుంటాం అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్ అన్నారు.సర్ సి.వి రామన్ చిత్రపటానికి పూలమాలవేసి సైన్స్ దినోత్సవాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శేఖర్ మాట్లాడుతూ సైన్స్ జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ బృందం ప్రోత్సాహంతో విద్యార్థులు వివిధ రకాలైన ఏఐ తో కూడిన సైన్స్ ప్రాజెక్టులు పలువురిని ఆకట్టుకున్నాయి ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శిస్తూ ప్రాజెక్టులను విద్యార్థులు వివరించడం అభినందనీయం అన్నారు. ప్రాజెక్టులు రూపొందించడంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేఖర్ బహుమతులు అందజేశారు.. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నబి, నర్సింగ్ రావు, శ్రీనివాస్, కిరణ్, అంజయ్య, రమేష్, స్వర్ణలత సౌజన్య సుజాత విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాఘవేంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో జాతీయ విజ్ఞాన దినోత్సవ సంబరాలు





**నేటి ప్రభాత దర్శిని,ఫిబ్రవరి 28 (ముస్తాబాద్ ప్రతినిధి ):**
ముస్తాబాద్ మండల కేంద్రంలోని రాఘవేంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో, సైన్స్ డే సందర్బంగా, విద్యార్థులు అన్ని సబ్జెక్ట్స్ లో కలిపి 400 ప్రోజెక్ట్స్ చేశారు. ఈ యొక్క సైన్స్ ఫెయిర్ కు ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి నిమ్మల రాజిరెడ్డి,ముస్తాబాద్ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి,సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి,ఉప సర్పంచ్ విజయ్, వార్డు మెంబర్లు హాజరు అయ్యారు.ఎం ఈ ఓ, సర్పంచ్ సెస్ డైరెక్టర్ లు విద్యార్థులు చేసిన ప్రాజెక్ట్స్ గురించి ప్రశంసించారు .ఈ కార్యక్రమం లో కరెస్పాండంట్ నరేష్, హెడమాస్టర్ మంజుల,అపర్ణ మరియు ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అలరించిన వైజ్ఞానిక ప్రదర్శన










**నేటి ప్రభాతదర్శిని రాజన్న సిరిసిల్ల ఫిబ్రవరి 28 :** జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భముగా జెడ్పిహెచ్ ఎస్, గీతా నగర్, సిరిసిల్ల పాఠశాలలో జాతీయ సైన్స్దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.హెచ్ ఎం శారద సీవీ రామన్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన సైన్స్ మోడల్ లని ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల హెచ్ ఎం లోకిని శారద ,ఇంచార్జి రాజలింగం మరియు సైన్స్ ఉపాధ్యాయులు మైలారం తిరుపతి, దోర్నాల భూపాల్ రెడ్డి, చిదురుల రవిబాబు, శ్రీనివాస్, సంగీత, వెంకట్ రాములు, జడ్జిలుగా స్వప్న, రజని, విమోచన లు వ్యవహరించారు.

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా శ్రీనివాస్ రావు బాధ్యతల స్వీకరణ



**నేటి ప్రభాత దర్శిని ప్రత్యేక ప్రతినిధిమంచిర్యాల,,ఫిబ్రవరి 28,** మంచిర్యాల రజస్వ మండల అధికారిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా పని చేసిన పి.చంద్రయ్య పదోన్నతి పై జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గా విధులు నిర్వహిస్తున్నారు.

# పౌరుల హక్కులను కాపాడడం మనందరి బాధ్యత

**- ఎస్సీ ఎస్టీ డెవలప్మెంట్ అధికారి కరుణాకర్ వెల్లడి.**




**(నేటి ప్రభాత దర్శిని ):-** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఎస్సీ ఎస్టీ అభివృద్ధి అధికారి బి కరుణాకర్ మాట్లాడుతూ పౌరుల హక్కులను కాపాడడం మన బాధ్యత అన్నారు ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది ఈ సమావేశంలో కరుణాకర్ మాట్లాడుతూ ఇప్పటికీ కొన్ని గ్రామాలలో కుల వివక్ష పోలేదన్నారు ఎక్కడో ఒకచోట హోటల్లో రెండు గ్లాసుల పద్ధతి నడుస్తుందన్నారు ఎస్సీ ఎస్టీలను సమాజానికి దూరంగా ఉంచే విధంగా అగ్రవర్ణాలు ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు కులాలు మతాల మధ్య ఎలాంటి తారతమ్యం లేకుండా అందరం సమానమని భావన రావాలని పిలుపునిచ్చారు అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో ప్రతి పౌరునికి హక్కులు బాధ్యతలు విధులు సమానంగా ఉన్నాయన్నరు అధికారులు కూడా అందరిని సమానంగా చూడాలని లేనియెడల చట్టం ఎవరినైనా శిక్షించక తప్పదు అన్నారు అనంతరం జిపిఓ ప్రకాష్ ప్రతిజ్ఞ చేయించారు ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎస్కే సాబేర బేగం ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎస్కే షబ్బీర్ నారాయణపూర్ జిపిఓ ప్రకాష్ ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి వార్డు సభ్యులు నాయకులు ఎస్కే గౌస్ నిమ్మ సుధాకర్ రెడ్డి వంగర లక్ష్మణ్. నల్ల పరుశురాములు గ్రామస్తులు పాల్గొన్నారు

## కన్న తల్లిపై పెట్రోల్ పోసి కాల్చి చంపిన కసాయి కొడుకు



**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి.**
కన్న తల్లిదండ్రులకు కొడుకులు వృద్ధాప్యంలో ఆసరాగా ఉంటూ వారి క్షేమాలను చూసుకోవలసిన వారే వారి పాలిట యములుగా మారుతున్నారు. విచ్చలవిడిగా గ్రామీణ ప్రాంతంలో వెలసిన బెల్ట్ షాపుల వల్ల మద్యం 24/7 అందుబాటులో దొరకడంతో కొంతమంది మద్యానికి బానిసై కన్న తల్లిదండ్రులను, కట్టుకున్న భార్యలను సైతం చూడకుండా కాటికి పంపిస్తున్నారు. అంతేకాకుండా నవ మాసాలు మోసి పెంచి పెద్ద చేసిన ఆ చిన్నారులను సైతం ఈ మానవ మృగాలు హత్యలకు పాల్పడుతున్నారు. తాజాగా.నిజామాబాద్ జిల్లా కోటగిరిలో జరిగిన ఘటన మద్యం మత్తులో ఉన్న ఓ కొడుకు తన కన్నతల్లిని ప్రాణాలతో ఉండగానే పెట్రోలు పోసి సజీవదహనం చేసిన దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది.శుక్రవారం రాత్రి బ్రాహ్మణగల్లికి చెందిన మానాజీ మద్యానికి బానిసై, తన తల్లి భూమవ్వపై దాడి చేసి, ఇంట్లోని పాత బట్టలు వేసి నిప్పు పెట్టి కాల్చి చంపాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# స్పష్టమైన చూపు -- సురక్షిత డ్రైవింగ్‌కు కీలకం. ఎస్ పి.. రాజన్న సిరిసిల్ల జిల్లా

**నేటి ప్రభాత దర్శిని.** స్పష్టమైన దృష్టి,నియంత్రిత వేగం,ట్రాఫిక్ నిబంధనల పాటింపు ద్వారా ప్రమాదాలను గణనీయంగా నివారించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. సిరిసిల్ల,వేములవాడ పోలీసుల ఆధ్వర్యంలో కాత్యాయని,ఎల్.వి ప్రసాద్ హాస్పిటల్స్ సిరిసిల్ల,లయన్స్ క్లబ్ ఆఫ్ వేములవాడ,మాతృ శ్రీ ,శ్రీ వర్ష కంటి హాస్పిటల్స్ వేములవాడ వారి సహకారంతో డ్రైవర్లకు ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాలను ప్రారంభించి,పరీక్షల అనంతరం అవసరమైన వారికి జిల్లా ఎస్పీ కంటి అద్దాలు అందజేశారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరైవ్-ఆలైవ్ కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల,వేములవాడ పట్టణాల్లో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేశామని,రోడ్డు ప్రమాదాల నివారణలో డ్రైవర్ల పాత్ర కీలకమన్నారు.వయస్సు పెరిగే కొద్ది కంటి చూపు మందగించడం సహజమని, ముఖ్యంగా ప్రజలను తరలించే ప్యాసింజర్ వాహనాలకు చెందిన డ్రైవర్లు తమ కంటి చూపుపై మరింత శ్రద్ధ వహించాలని, పబ్లిక్ ట్రాన్స్పోర్టు వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులను వారి గమ్య స్థాలను క్షేమంగా చేరవేయాల్సిన బాధ్యత డ్రైవర్లపై వుందన్నారు ముఖ్యంగా కంటి చూపుతో బాధపడే వారు వాహనం నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరిగే అస్కారం అధికమని, రోడ్డు ప్రమాదాల నివారణకై డ్రైవర్లు సైతం నిరంతం కంటి పరీక్షలు నిర్వహించుకోవడం క్షేమకరమన్నారు. వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ మరియు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని,ద్విచక్ర వాహనం నడిపే సందర్భల్లో తప్పక హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, ఓవర్ స్పీడ్, ఓవర్ లోడింగ్, ర్యాష్ డ్రైవింగ్,సెల్ ఫోన్ డ్రైవింగ్ చేస్తే



కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈసందర్భంగా కాత్యాయని,ఎల్ వి ప్రసాద్ హాస్పిటల్స్ సిరిసిల్ల వారికి ,లయన్స్ క్లబ్ ఆఫ్ వేములవాడ ,మాతృ శ్రీ హాస్పిటల్, శ్రీ వర్ష కంటి హాస్పిటల్స్ వేములవాడ వారికి జిల్లా ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.

## పొలంలో నాటు బాంబు పేలుడు...

**- పాడి గేదెకు తీవ్ర గాయాలు...**



**నేటి ప్రభాత దర్శిని ఎల్లారెడ్డిపేట ప్రతినిధి.** రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో ప్రమాదకర ఘటన చోటుచేసుకుంది. పొలంలో పెట్టిన నాటు బాంబు పేలడంతో మేతకు వెళ్లిన పాడి గేదె తీవ్రంగా గాయపడింది. భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో గ్రామస్తులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. గాయపడిన గేదెకు పశువైద్యులు చికిత్స అందిస్తున్నారు. అడవి జంతువుల కోసం ఏర్పాటు చేసిన నాటు బాంబు కావచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# రేషన్ పంపిణీ పై డేగ కన్ను..

## - బియ్యం పట్టుబడితే డీలర్‌షిప్ రద్దు!

**నేటి ప్రభాత దర్శిని ప్రత్యేక ప్రతినిధి**

రేషన్బియ్యం పక్కదారి పట్టకుండా తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ నిఘా పెట్టింది. ప్రతి నెలలో రెండు పర్యాయాలు రేషన్దుకాణాలు, గోదాములు తనిఖీ చేసేందుకు విజిలెన్స్ ప్లాన్చేస్తోంది. ఇతర రాష్ట్రాలకు పీడీఎస్రైస్చేరవేసే దళారులకు సహకరించే డీలర్లపై డేగ కన్ను వేసింది. తనిఖీలో బయటపడితే వారి డీలర్‌షిప్రద్దు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. గత ఏడాది కాలంలో సుమారు 1500 క్వింటాళ్ల రేషన్బియ్యం విజిలెన్స్ తనిఖీలో పట్టుబడింది. దీంతో దీని వెనుక ఉన్న శక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలుస్తోంది. రేషన్కార్డులు పేదలతోపాటు కోటీశ్వర్లు కూడా పొందడంతో వారంతా సన్నబియ్యం తీసుకోకుండా డీలర్లకే కిలో రూ. 15 చొప్పున అమ్ముతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న కార్డుల జాబితాలో సుమారు 8 నుంచి 9 లక్షల వరకు నిబంధనలకు విరుద్ధంగా కార్డులు పొందిన వారు ఉన్నట్లు ఉన్నతాధికారులు గతంలోనే అంచనా వేసినప్పటికీ ప్రభుత్వం వాటి తొలగింపు దిశగా చర్యలు తీసుకోలేదు. తనిఖీలపై అత్యంత గోప్యత.. రేషన్దుకాణాలు, గోదాములు తనిఖీ చేసే వివరాలను అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. ముందుగా విజిలెన్స్బృందాలకు చెబితే సంబంధిత డీలర్లకు సమాచారం చేరవేస్తున్నారు. ఆఫీస్ నుంచి బయలుదేరే వరకు పక్కనే ఉన్న సిబ్బందికి కూడా తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నేరుగా డీలర్ల వద్దకు వెళ్లే వరకు ఎటువైపు వెళ్తున్నామో చెప్పకుండా ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. బియ్యం పంపిణీలో తప్పిదాలను గుర్తించి కౌన్సిలింగ్ఇస్తున్నారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్. స్టి ఫెన్రవీంద్ర మాట్లాడుతూ.. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం

**నేటి ప్రభాత దర్శిని, నిజామాబాద్ ప్రతినిధి:**నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. సర్ సీవీ రామన్ 1928 ఫిబ్రవరి 28 న రామన్ ఎఫెక్ట్ కనుగొనడంతో ప్రభుత్వం ప్రతీ ఏటా ఫిబ్రవరి28న జాతీయ విజ్ఞాన దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించిందని పలువు హెడ్మాస్టర్ లు తెలిపారు. సర్ సివి రామన్ ను ఆదర్శంగా తీసుకొని ప్రతీ విద్యార్థి విజ్ఞాన శాస్త్రంలో జ్ఞానాన్ని సంపాదించి పేరు ప్రతిష్టలు పొందాలన్నారు. ఈ మేరకు మండలం లోని పలు స్కూళ్లలో సైన్స్ ప్రాజెక్టు లను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సైన్స్ ప్రాజెక్ట్ లను పరిశీలించి విద్యార్థులను ప్రశంసించారు. ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. అలాగే పలు పాఠశాలల్లో సైన్స్ క్విజ్ వ్యాసరచన,చిత్రాలేఖనం పోటీలు నిర్వహించారు.,ఈమేరకు ఆయా స్కూళ్లలో సరస్వతీ దేవి, సర్ సివి రామన్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ఆయా స్కూళ్ల హెడ్మాస్టర్లు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు

# బీఆర్ఎస్ హయాంలో.. మూసీ అభివృద్ధి అద్భుతం



**ఎల్బీనగర్ :**మూసీ పునరుజ్జీవం, గాంధీ సరోవర్ పేరిట మా ఇండ్లు కూల్చకండి.. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా ఒక్క ఇటుకా కూల్చకుండా అభివృద్ధి చేయండి.. అలా కాకుండా గృహాలను కూలుస్తామంటే ఊరుకోం.. మా ఇండ్ల జోలికి వస్తే ప్రాజెక్ట్ను అడ్డుకుంటాం’ అని మూసీ బాధితులు అన్నారు. నాగోలు బ్రిడ్జి ప్రాంతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క ఇల్లూ కూల్చకుండా చేపట్టిన అభివృద్ధి, సుందరీకరణ పనులను మధుపార్క్, హైదర్షాకోట్ ప్రాంతం మూసీ బాధితులు శనివారం సందర్శించారు. నాగోలు ప్రాంతంలో మూసీ పక్కన వాకింగ్ ట్రాక్, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, సీవరేజీ ప్లాంట్లు అద్భుతంగా ఉన్నాయన్నారు.తమ ప్రాంతంలోనూ ఇలా అభివృద్ధి చేస్తే సహకరిస్తామన్నారు. ‘అలా కాకుండా రియల్ ఎస్టేట్ కోసం మా స్థలాలు లాక్కుంటామంటే ఊరుకోం’ అని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నాగోలు బిడ్జ్ ప్రాంతంలో మూసీ నది పక్కన బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధిని రెడ్కో మాజీ చైర్మన్ సతీశ్‌రెడ్డి వారికి వివరించారు. నాగోలు ప్రాంతంలా అభివృద్ధి చేయకుండా ఎందుకు తమ ఇండ్లను లాక్కుంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారుమూసీ నది వెంట ఉన్న ఇండ్లను కూల్చివేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై తాము న్యాయ పోరాటం చేస్తామన్నారు. నాగోలు మూసీ ప్రాంతానికి హైదర్షాకోట్, మధుపార్క్ రిడ్జ్, డ్రీమ్ హోమ్స్, సాయిరాంనగర్ తదితర ప్రాంతాల నుంచి సుమారు వంద మంది గాంధీ సరోవర్ బాధితులు ప్లకార్డులతో నినాదాలు చేసుకుంటూ వచ్చారు. వీరికి జతగా ఎల్బీనగర్ నియోజకవర్గం చైతన్యపురి ప్రాంతానికి చెందిన మూసీ బాధితులు కూడా నాగోలు బ్రిడ్జ్ ప్రాంతానికి చేరుకుని ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు.సీఎం అంకుల్ మా ఇంటి జోలికి రాకండి. మా ఇల్లు కూలుస్తామంటే ఎట్లా.. మేం ఊరుకోం.. అడ్డుకుంటాం. ముందు మూసీ కాలుష్యాన్ని ఆపండి. డ్రైనేజీ సిస్టం బాగు చేయండి, ఇండ్ల జోలికి రాకండి.-- అనిశా (మొదటి తరగతి, హైదర్షాకోట్)ఇండ్లు కూల్చకుండా అభివృద్ధి చేయండిప్రభుత్వం గాంధీ సరోవర్, మూసీ అభివృద్ధి మా ఇండ్లు కూల్చకుండా చేయండి. నాగోలు ప్రాంతం బాగుంది. ప్రశాంతంగా ట్రాక్, పార్కులు, అన్ని విధాలుగా అద్భుతంగా ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బాగా చేసింది- మౌనిక ( విఘ్నేశ్వర కాలనీ, హైదర్షాకోట్)సర్కారు పనితీరు అధ్వానంప్రభుత్వం ప్రజల స్థిరాస్తిని మూసీ నది అభివృద్ధి కోసం కోరుతున్నారంటే వారి పనితీరు ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతున్నది. నాగోలు ప్రాంతానికి వచ్చాం. అద్భుతంగా ఉంది. ఇలాంటి అభివృద్ధిని కోరుతున్నాం.-- విశాలాక్షి, హైదర్షాకోట్, డ్రీమ్‌హోమ్స్ప్రభుత్వ అనుమతులతోనే కొనుగోలుప్రభుత్వ అనుమతులతో ఇండ్లను కొనుగోలు చేశాం. ఒక్కో ప్లాట్ నాలుగు, ఐదు సార్లు రీసేల్ అయ్యి రిజిస్ట్రేషన్లు అయ్యాయి. మూసీ పేరు చెప్పి.. మా స్థలాన్ని కబ్జా చేయవద్దని చెబుతున్నాం. నాగోలులో అద్భుతంగా అభివృద్ధి చేశారు. ఒక్క ఇల్లు కూల్చకుండా వాకింగ్ ట్రాక్, సివరేజీ ప్లాంట్, పార్కు చాలా బాగుంది. ఐడియల్‌గా ఉంది.వాసుదవరావు, హైదర్షాకోట్గాంధీజీ చెప్పారామా ఇల్లు కూల్చి మూసీ బాగు చేయమని గాంధీజీ చెప్పారా? ఇది మానుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి చెబుతున్నాం. ఇల్లు కూల్చుతామని చెబుతున్నారు. 30 ఏండ్లుగా ఉంటున్నాం. కేసీఆర్ ప్రభుత్వం నాగోలులో ఎలా అభివృద్ధి చేశారో అలాగే మా ప్రాంతంలోనూ చేయాలని కోరుతున్నాం.-- సుబ్రహ్మణ్యకుమార్ (రిటైర్డ్ ఉద్యోగి, మధుపార్క్ )కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం బాగా లేదుకాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం బాగా లేదు. వారు మూసీ అభివృద్ధి అని చెప్పి మా ఇండ్లను కూలుస్తామంటే ఎట్లా? ముందు మూసీని కాలుష్యం నుంచి కాపాడండి. మూసీలో డ్రైనేజీ సిస్టం బాగు చేయాలి.-- కోట శ్రీదేవి ( చైతన్యపురి, న్యూ మారుతీనగర్)నాగోల్‌లా చేయండిమూసీని బాగు చేయండి. నాగోలు ప్రాంతంలో మాదిరిగా అభివృద్ధి చేయండి. కానీ మా ఇండ్లను ఎందుకు కూల్చుతున్నారు. ప్రభుత్వంతో మా డిమాండ్ ఏమిటంటే ఇది మా ఇల్లు.. మా ఇంటిని వదిలిపెట్టేది లేదు. అన్ని అనుమతులతో నిర్మించాం. మాది బఫర్‌జోన్‌లో లేదు. మేం ఇక్కడే ఉంటాం.

# ఉపాధి హామీ పనులలో అవినీతి చేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకుంటారో ...లేదో..





**నేటి ప్రభాతదర్శిని బాన్సువాడ ప్రతినిధి.**

బాన్సువాడ మండలం ఖాద్లపూర్ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో అవకతవకలు జరిగాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఉపాధి హామీ పనులు నిర్వహించిన సీనియర్ మేట్ ప్రశాంత్ నకిలీ జాబ్ కార్డులు సృష్టించి అవినీతి చేశారని పేర్కొంటూ ఫిబ్రవరి 23న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయికి ఫిర్యాదు చేశారు. సబ్ కలెక్టర్ సంబంధిత అధికారులను విచారణకు ఆదేశించడంతో శనివారం ఎంపీడీవో ఆనంద్, ఏపీవో బిక్షపతి ఖాద్లపూర్ గ్రామానికి చేరుకుని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ పనులపై విచారణ చేపట్టారు. విచారణ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, 2020 సంవత్సరం నుంచి నేటి వరకు ఎటువంటి పనులు చేయని వారి పేర్లపై కూడా డబ్బులు చెల్లించారని ఆరోపించారు.పేదల, నిరాక్షరాస్యతను ఆసరాగా చేసుకొని వారి జాబ్ కార్డులను ఉపయోగించి నిధులు దుర్వినియోగం చేశారని తెలిపారు. అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, కాజేసిన సొమ్మును నిజమైన ఉపాధి కూలీలకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన వారిపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకుంటారా? లేదో..రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వదిలేస్తారా? అనే చర్చ గ్రామంలో కొనసాగుతోంది.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆనంద్,ఎంపిఓ సత్యనారాయణ రెడ్డి, గ్రామ కార్యదర్శి షహనాజ్ టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్, గోపాల్ గ్రామస్తులు అంకోష్, గణేష్ మధు, మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యుత్ చోర్యం.. అధికారుల చోద్యం..

**నేటి ప్రభాత దర్శిని ఎల్లారెడ్డిపేట ప్రతినిధి.**

నిబంధనల ప్రకారం కోళ్ల ఫారాలకు విద్యుత్తును సరఫరా చేయాలంటే ప్రత్యేకించి అర్బన్ కనెక్షన్ ను తీసుకోవాల్సి ఉంటుంది. అందుకు కొంతమేర సెస్ కు పన్ను చెల్లించాలి. ప్రత్యేక కరెంటు కనెక్షన్ ను తీసుకోవాలి. కానీ రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిబంధనలకు మంగళం పాడుతున్నారు. వ్యవసాయ విద్యుత్తును యదేచ్ఛగా వినియోగిస్తున్నారు. కొందరు కోళ్ల ఫారాల యజమానులు అక్రమంగా త్రీ పేజు కరెంటును ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా వాడుతున్నారు. విద్యుత్తు నియంత్రికలకు, తీగలకు కొక్కేలు తగిలించి విద్యుత్తును దొంగతనంగా వాడుకుంటున్నారు. కోళ్ల ఫారాలు వ్యవసాయ క్షేత్రాల్లో ఉన్నప్పటికీ నిర్వహణకు ప్రత్యేకించి సింగిల్ ఫేసు మోటార్లను వినియోగించాలి. అంతేకానీ పంట పొలాలకు వాడే కరెంటును వినియోగించరాదు. ఈ అక్రమ కనెక్షన్ల వల్ల సెస్ ఖజానాకు భారీ ఎత్తున గండిపడుతోంది. విద్యుత్తు అక్రమ వినియోగం చోద్యం చూస్తున్న సెస్ అధికారులు. గల ఓ పౌల్ట్రీ ఫార్మ్ యజమాని యదేచ్ఛగా ట్రాన్స్ ఫార్మర్ కు వైర్లు తగిలించి మూడు పౌల్ట్రీఫారాలకు విద్యుత్ వినియోగం అక్రమంగా వాడుకుంటున్నారు.ఈ తతంగం దాదాపు రెండు సంవత్సరాల నుండి నడుస్తున్నట్టు తెలిసింది. ఇట్టి పౌల్ట్రీ ఫామ్ లు. మండలంలోని ఒక నాయకుడు విద్యుత్ దొంగతనంగా



వినియోగించుకుంటున్నారు. ఇట్టి అక్రమ విద్యుత్ వినియోగానికి స్థానికంగా ఉన్న హెల్పర్లు సపోర్ట్ చేయడం వల్ల ఇలాంటి అక్రమ విద్యుత్ వినియోగాలు పౌల్ట్రీఫారాలకు స్థానికంగా ఉన్న చిన్న చిన్న పరిశ్రమలకు కూడా హెల్పర్ల సహకారంతో ఇలాంటి అక్రమ చర్యలకు పాల్పడుతున్నారు. కేవలం గృహ అవసరాలకు 500 రూపాయలు లేదా వెయ్యి రూపాయలు సెస్ కు బకాయి ఉంటే డిపి సెక్షన్ వాళ్లు వచ్చి విద్యుత్ కట్ చేసి వెళ్తుంటారు కానీ ఇలాంటి అక్రమాలు సెస్ అధికారుల కంటపడిన చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. 24 గంటలు విద్యుత్ సౌకర్యం గల ఎక్స్ ప్రెస్ పీడర్లా ద్వారా ఇవి నడుస్తున్నాయి. కోళ్ల పరిశ్రమల నిర్వహణకు కొంత మేర పన్ను చెల్లించి కరెంటు సౌకర్యాన్ని పొందాల్సి ఉంటుంది కానీ కొన్నిచోట్ల ఈ నిబంధనలు కాలరాస్తున్నారు.అక్రమ విద్యుత్ కనెక్షన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాము సెస్ ఎడి శ్రీనివాస్.సెస్ పరిధిలో ఎక్కడా కూడా అక్రమ విద్యుత్తు వినియోగం జరిగిన అవి తొలగించడానికి ప్రత్యేక దృష్టి పెట్టామని, ఒకవేళ తమ సిబ్బంది ఇట్లాంటి అక్రమ విద్యుత్ వినియోగానికి ప్రోత్సహించిన వారిపై కూడా శాఖ పరమైనచర్యలు తీసుకుంటామని ఏడి పేర్కొన్నారు. సెస్ పరిధిలో

గృహ..189.074
వాణిజ్య..24.311
పరిశ్రమలు..70.173
వ్యవసాయం..80.626
గ్రామపంచాయతీలు..3.929
మిల్లులు .. హెచ్ టి...40
ఇతర....,..1.311.

# ఎడపల్లి జడ్పీ హెచ్ఎస్ లో విద్యార్థులకు అవగాహన సదస్సు

**నేటి ప్రభాత దర్శిని, నిజామాబాద్ ప్రతినిధి:**

విద్యార్థులు చదువుతో పాటు సామాజిక అంశాలపైన, ఆరోగ్యంపైన అవగాహన కలిగి ఉండాలని వర్డ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి రజిత అన్నారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు కీలక అంశాలపై శిక్షణ ఇచ్చారు. ప్రధానంగా వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం శ్రద్ధ వహించాలన్నారు.రక్తహీనత నివారణ, పౌష్టికాహారం ప్రాముఖ్యత మరియు రుతుచక్రం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు.హెచ్ఐవి సంక్రమణ పద్ధతులు, దానిపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించడంపై వివరించారు. బాలల హక్కులు, వారి కోసం ఉన్న చట్టాలు మరియు మానవ అక్రమ రవాణా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత ఏడాది ఇప్పటికే నాలుగు సెషన్లలో శిక్షణ పూర్తి చేయగా, తాజాగా నిర్వహించిన ఈ పునశ్చరణ తరగతులు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడ్డాయని ఉపాధ్యాయులు తెలిపారు. నేర్చుకున్న విషయాలను గుర్తుచేసుకోవడానికి ఈ సెషన్ తోడ్పడిందని విద్యార్థులు సానుకూల ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి మరిన్ని విజ్ఞానదాయకమైన కార్యక్రమాలు నిర్వహించాలని విద్యార్థులు, పాఠశాల సిబ్బంది కోరారు. సామాజిక బాధ్యతతో విద్యార్థులను చైతన్యపరుస్తున్న వర్డ్



ప్రతినిధి రజితకు పాఠశాల బృందం ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది

# మైదానాన్ని తలపిస్తున్నపౌనికి వనం

**రూ.9.15 లక్షలు వృథా.. పట్టించుకోని అధికారులు**

**నిర్మల్ జిల్లా** సారంగాపూర్ మండలంలోని గోపాల్‌పేట్ గ్రామ పంచాయతీ పరిధిలో గల షేక్‌సాబ్‌లొద్ది పక్కన ఐదెకరాల రిజర్వు ఫారెస్టు విస్తీర్ణంలో పొనికి మొక్కల పెంపకాన్ని చేపట్టారు. ఈ వనములో ఉపాధి హామీ పథకంలో భాగంగా రెండు వేల మొక్కలు నాటారు. కూలీలు, ఆయా పనులకు రూ. 9,15,677 నిధులు ఖర్చు చేశారు. నీటి సౌకర్యం కోసం నాలుగు బోర్లు వేశారు. వీటిలో రెండు బోర్లు పని చేస్తుండగా.. మరో రెండు పని చేయడం లేదు. దీంతో మూడేండ్ల నుంచి మొక్కలకు నీరు అందక ఎండిపోయి మైదానాన్ని తలపిస్తున్నాయి.దీంతో పొనికి వనంలో 2 వేల మొక్కలకు ప్రస్తుతం ఐదు నుంచి పది మొక్కలు బతికి ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో మొక్కలు ఎండిపోయాయి. పొనికి



మొక్కలతో కొయ్యబొమ్మల కళాకారులు అందమైన బొమ్మను తయారు చేస్తారు. వనములో మొక్కలు పూర్తిగా ఎండిపోవడంతో కొయ్యబొమ్మల తయారి కష్టంగా మారనుంది. దీంతో అనుకున్న లక్ష్యం నీరుగారి పోతుంది. అధికారులు స్పందించి పొనికి వనములో తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో లక్ష్మీకాంత్‌ను వివరణ కోరగా.. బండభూమి వల్ల మొక్కలు ఎండిపోతున్నాయని, కరెంట్ దర్గా నుంచి తీసుకోవడం వల్ల కోతులు వైర్లను తెంపేస్తున్నాయని, బోర్ల ఉన్న గ్రౌండ్ వాటర్ సరిగా లేకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయని తెలిపారు.

